



# పరమేశం పొదుపు

బాలం వెంకటరావు

బజారుకెళ్లి సరకులు తెమ్మని అయిదొందలు ఇచ్చాడు పరమేశానికి, తండ్రి తాతారావు. తు.చ. తప్పకుండా ఆ అయిదొందలూ ఖర్చు పెట్టేసి సరకులు తెచ్చాడు పరమేశం. తాతారావు తనిచ్చిన చిట్టా తీసుకుని లెక్క పెట్టసాగాడు.

" ఉల్లిపాయలు ఆరు కేజీలు - వచ్చాయా ?" అడిగాడు.

" ఆ వచ్చినయ్ ! నిల్వ ఉంటాయిని ఎనిమిది కేజీలు తీసుకున్నాను" - గొప్ప పనిచేసినట్టుగా అన్నాడు పరమేశం. దాంతో గయ్‌మన్నాడు తాతారావు. "అన్ని ఎందుకు తీసుకున్నావురా,"

"ఏమీ పాడవవు కదాని తీసుకున్నాను." అమాయకంగా పరమేశం.

"సర్లే... కందిపప్పు ఎనిమిది కేజీలు వచ్చాయా ?" సరిపెట్టు కున్నట్టుగా తాతారావు.


"వచ్చాయ్ ! పది కేజీలు తీసుకున్నాను, బావుందని.' మరో బాంబు.

"నీ దుంపతెగ ... పెసలు ఆరు కేజీలు ఉన్నాయా?'

"పెసరట్లు వేసుకోవడానికి బావుంటాయిని తొమ్మిది కేజీలు తీసుకున్నాను."

" నీ మొహం తగలెయ్య! అన్ని ఏం చేసుకుంటావురా ? సర్లే, బట్టల సబ్బులు డజను, స్నానం సబ్బులు డజను. ఉన్నాయా ?

" లెక్క పెట్టుకో, కరెక్టుగానే ఉంటాయి. కాదంటే




కొత్త రకం టాయ్‌లెట్ సబ్బు మార్కెట్లోకి వస్తే రెండు అదనంగా తీసుకున్నాను. ఎక్స్‌పోర్ట్ క్వాలిటీది. సెంటెడ్ స్మెల్"

"వాటి కెంతయింది?"

"ఎంత ? రెండూ ఇరవై నాలుగు రూపాయలు."

"ఆ అంతా?... ఆ ఖరీదు పెడితే మరో వస్తువు ఏదయినా వస్తుంది కదరా ?"

"ఇది మాత్రం అదనపుది కాదేమిటీ? ఎలా ఉంటుందో చూడాలి కదా !"

"ఏం చూస్తావ్ నా శ్రాద్ధం! అది సరే, ఎండు మిరప కాయలు ఏవిరా ? రెండు కేజీలు తెమ్మన్నాను."

"తేలేదు. డబ్బులు చాల్లేదు."

"నీ మొహం మండ. అసలైనవి మానేశావేరా ? ఇన్ని తెచ్చుకున్నా కూరల్లోకి కారం లేకుండా ఎలా వండుకు తింటావురా అప్రాచ్యుడా?" ఘాటు మిరపకాయలా మండిపడ్డాడు తాతారావు.

"డబ్బులు అన్నీ ఖర్చుపెట్టే తెచ్చాను ఇవన్నీ. ఏమీ మిగల్లేదు. కాదంటే మొన్న నేను సినిమాకు వెళ్లినప్పటి బాకీ పది రూపాయలు మా స్నేహితుడికి ఇచ్చాను." అన్నాడు అమాయకంగా.

" అదేరా నే నేది. చెప్పిన ప్రకారం నువ్వు తెస్తే డబ్బులు ఇంకా మిగిలేవి. సరకులూ పూర్తిగా తేలేదు. డబ్బులూ అవజేశావు. అనాకారి సన్నాసి! డబ్బులు ఎంత జాగ్రత్తగా ఖర్చు పెట్టుకోవాలో తెలుసా నీకు ? తెలీదు.బజారులోకి వెళ్లేటప్పుడు పది రూపాయలు తీసుకెళ్తే వచ్చేటప్పుడు రూపాయి మిగుల్చుకుని రావాలిరా. అది పద్ధతి ! పొదుపు. జాగ్రత్త అంటే అలా ఉండాలి. అంతేగాని పట్టుకెళ్లిన పదిరూపాయలకి పదిహేను రూపాయలు ఖర్చు చేయటం పొదుపు చేసే లక్షణం కాదు. తెలిసిందా ?" పొదుపు వ్యాఖ్యానం వినిపించాడు తనయుడికి. అలాగే అన్నట్టు తలాడించాడు పరమేశం.

వీడికి డబ్బు దగ్గర ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలీటం లేదు. చేతికి రూపాయి ఇస్తే చాలు. క్షణంలో హుష్ కాకే ! జేబులో పైసా ఉండనీయడు. ఇంట్లోకి సరుకులు తెమ్మని డబ్బులిస్తే వాడికి నచ్చిందనేసి ఏదో ఒకటి కొనిపారేస్తాడు తప్ప అది అవసరమా, కాదా అని కొంచెం కూడా ఆలోచించడు. ముఖ్యావసర సామాన్లు వదిలేసి అవసరం లేనివాటి కోసం డబ్బులు తగలేస్తాడు వీడికి జాగ్రత్త అనేది ఎప్పుడు అబ్బుతుందో! ముందు ముందు ఎలా బతుకుతాడో, ఏమో! ఏదైనా ఉపాయం ఆలోచించాలి. ఇలా అనుకోసాగాడు మనసులో తాతారావు.

"ఇంకా ఏమిటి నాన్నా చూస్తున్నారు? సామాను సర్దుదాం" అన్నాడు పరమేశం గట్టిగా. ఆ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు తాతారావు. 'ఆ సర్దు....సర్దు. ఇంకేముంది చూడ్డానికి ?" అన్నాడు సాలోచనగా. తండ్రి అలా అనేటప్పటికి ఆ మాట తీరు తనని దెప్పినట్టుగానే పరమేశానికి అని పించింది గాని ఆ వెంటనే దానికే ముందిలే అని సరిపెట్టేసుకున్నాడు మనసులో. తర్వాత ఇద్దరూ కలిసి ఏ సరకు ఏ డబ్బాలో వేయాలో వేసేశారు.

ఆ రోజు సాయంకాలం అందరూ భోజనాలు చేస్తున్నారు. తాతారావు భార్య భద్రమ్మ మనవరాలి పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చింది. ఆ సందర్భంలో వంటకాల మాటలు కూడా దొర్లాయి. దాంతో పరమేశం అందు కున్నాడు - "కాకినాడ కాజాలు చాలా బావుం టాయ్ అమ్మా" అన్నాడు.

"ఎందుకు బాగోవు? అన్నీ బాగానే ఉంటాయి. డబ్బుంటే బందరు లడ్డూలు, భాగ్యనగరం బిరియానీలు చక్కగానే ఉంటాయ్." చిర్రెత్తుకొచ్చినట్టుగా అన్నాడు తాతారావు. వెంటనే భద్రమ్మ కలుగ చేసుకుంది. 'ఏవిటండీ ఆ మాటలూ మీరూనూ?' అంది సాగదీస్తూ. అని మళ్లీ తనే అంది "భాగ్యనగరమంటే గుర్తొచ్చింది. అమ్మాయి వాళ్లు హైదరాబాదులో ఎలా ఉన్నారో! వేసవిలో వాళ్లకి నీళ్లు సరిగా దొరకవ ట. ఓ సారి చూసివస్తే బావుణ్ణు."

ఆ మాటలకు పరమేశంలో ఉత్సాహం ఉబికి వచ్చింది. "అవునే అమ్మా ! చూసొస్తే బావుంటుంది. నే వెళ్లొస్తాను. " అన్నాడు సాగదీస్తూ.

"సరేలే వెడుదువుగాని, మీ నాన్న ఒప్పుకోవాలిగా" అంది భద్రమ్మ అనునయంగా.

ఆ మాటలతో తాతారావు ఆలోచనలో పడ్డాడు.

'వాణ్ణి హైదరాబాదులో బావ దగ్గర కొన్ని రోజులు ఉంచితే బవుంటుందేమే! అక్కడయినా మనిషి కొంచెం మారతాడేమో! అవును, అదే మంచి పద్ధతి.' నిశ్చయానికి వచ్చిన వాడిలా అనుకుని "ఆ అలాగే చేద్దాం" అన్నాడు గట్టిగా.

ఊహించని రీతిలో తండ్రి ఆ మోదముద్ర వేసి నందుకు ఎగిరి గంతేశాడు పరమేశం. " అయామ్ లక్కీ ఫెలో!" అన్నాడు ఆనందంగా. కొడుకుతోపాటు భద్రమ్మకు కూడ సంతోషం కలిగింది. వాళ్లతో తాతారావు శ్రుతి కలిపాడు. ఆరోజు అలా గడిచిపోయింది.

హైదరాబాదు ప్రయాణ మనే టప్పట్నుంచి పరమేశానికి కాళ్లు నిలవటం లేదు. ఎక్కడెక్కడో తిరిగేయాలనీ, ఏవేవో చేసేయాలనీ అనిపిస్తోంది. పూర్తిగా ఊహల్లో తేలిపోసాగాడు. ఎలాగైతేనేం ఆ రోజు రానే వచ్చింది.

ఆ రోజే పరమేశం నగర ప్రయాణం. వీడ్కోలు చెప్పడానికి తల్లి, తండ్రి, తమ్ముడు ఇంకా ఇద్దరు స్నేహితులు అందరూ రైల్వేస్టేషన్‌కి వచ్చారు. రైలు బయలుదేరటానికి ఇంకా పది నిముషాలు టైముంది.

"జాగ్రత్తరా అబ్బాయ్! నువ్వెళ్లేది పెద్ద నగరం. రైలు టిక్కెట్టు భద్రంగా పెట్టుకో. ఇక్కడిలా టిక్కెట్టు ఇవ్వకపోతే అక్కడ ఊరుకోరు.అన్నట్టు ఆవకాయ జాడి, సూట్‌కేసు, డబ్బులూ అవీ జాగ్రత్తగా చూసుకుంటూ ఉండు. తెల్ల వార్లూ నిద్రపోకు."

భద్రమ్మ, తాతారావులు ఒకటికి రెండుసార్లు చెప్పిందే చెప్పి మెలకువలు బోధించారు. అన్నిటికీ ' ఊ' ఊ అంటూ తలాడించాడు పరమేశం. కాసేపటికి రైలు కూత వేస్తూ బయలుదేరింది. అందరూ టాటా చెప్పారు. పరమేశం ఆ రాత్రంతా నిద్రపోకుండానే ఉన్నాడు.

తెల్లారేటప్పటికి రైలు సికింద్రా బాద్ స్టేషన్ చేరుకుంది. బండి ఆగిన వెంటనే కూలీలు బిలబిల మంటూ వచ్చేశారు బోగీల్లోకి. పరమేశం వాళ్లని ఆదోలా చూసి 'వీళ్లెందుకులే' అనుకున్నాడు మనసులో. ఓ చేత్తో ఆవకాయ జాడీ, చేత్తో సూటుకేసు! పట్టుకుని గేటు వద్ద టికెట్ ఇచ్చేసి బయటికి వచ్చాడు.

'హమ్మయ్య! మహానగర ప్రవేశం చేశాను.' అనుకున్నాడు తృప్తిగా మనసులో. ఇంతలో ఇద్దరు ఆటో డ్రైవర్లు పరమేశాన్ని చుట్టుముట్టారు.

"కిదర్‌జానా?"

"యాడికి పోవాల?"

ఉర్దూ, తెలుగు మాటల్తో ఉక్కిరిబిక్కిరి చేసేశారు వాళ్లు. పరమేశం జేబులోంచి అడ్రసు కాగితం తీసి హైదరాబాదులో ఫలానా చోటికి అని చెప్పాడు. "చాలీస్ రుపియా" అని ఒకరు ముప్పయిదు రూపాయలు అని అన్నారు

ముప్పై అయిదు రూపాయలా? అంటే రైలు టిక్కెట్టులో సగం ధర అన్నమాట! అవున్లే సిటీ కదా ఆమాత్రం ఉంటుందిలే " తనలో తనే గొణుక్కున్నాడు పరమేశం.

"సరే పద" అని తెలుగు ఆటో ఎక్కాడు. ఆటో జామ్మంటూ దూసుకుపోతోంది హైదరాబాదు వైపు.

కొంతసేపటికి ట్యాంక్‌బండ్ వచ్చింది. హుస్సేన్‌సాగర్ రోడ్డు మీది అందాలు కనపడేటప్పటికి పరమేశానికి ఎక్కడలేని ఆనందం వచ్చేసింది. 'ఇక్కడ కూడా నదులూ, జలాశయాలూ బాగానే ఉన్నాయ్. నీళ్లకి కొదవేముంది?' అనుకున్నాడు తనలో తను.

చిరునామా ప్రకారం కొన్ని రోడ్లూ, సందులూ దాటి ఒక కాలనీలోని ఓ ఇంటి ముందు ఆగింది ఆటో. పరమేశం కిందికి దిగి ఇంటి నంబరు సరిచూసుకుని, కాలింగ్ బెల్ నొక్కాడు. క్షణాల్లో తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా అక్కయ్య సరోజ! పరమేశం ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. సరోజ సంభ్రమాశ్చర్యాలతో 'నువ్వట్రా తమ్ముడూ' అంది

"అవునక్కా నేనే ట్రెయినుకొచ్చాను" అంటూ సామాన్లు తీసి కిందపెట్టాడు.

"అదేమిట్రా అకస్మాత్తుగా ఊడిపడ్డావ్ ? ఉత్తరం ముక్కయినా రాస్తే స్టేషన్‌కు వచ్చేవాళ్లం కదా!" అంది సరోజ విస్తూరంగా.

"నిజమేనక్కా ఉత్తరం రాస్తే బాగానే ఉండేది. కాని టైము లేదు. అందుకే రాయలేదు" అన్నాడు పరమేశం జేబులోంచి డబ్బులు తీస్తూ.

"మీటర్ ఎంతయిందీ డబ్బులు అంతలెక్క పెడుతున్నావ్?" అడిగింది సరోజ. అక్కమాటల్తో పరమేశం గతుక్కుమన్నాడు. విస్మయంగా ఆమె వైపు చూసి "అదేమిటక్కా మీటరంటున్నావ్? నేను ముప్పై అయిదుకు మాట్లాడాను" అన్నాడు. దాంతో సరోజ నిర్ఘాంతపోయింది. "ఏం మనిషివిరా! ఆటోకి ముప్పై అయిదు రూపాయలా? హవ్వ! మీటర్ ప్రకారం చార్జి ఇచ్చుకోవాలి" అంది బుగ్గలు నొక్కుకుంటూ అని,తర్వాత తనే "పోనీలే. అయిందేదో అయిపోయింది. ఇచ్చెయ్యి ఆ డబ్బులు" అంది. పరమేశం ఇంక ఏమీ మాట్లాడ లేకపోయాడు. నోట్లు లెక్కపెట్టి డ్రైవర్ చేతిలో పెట్టాడు.

" ఆటోకి ఎప్పుడూ ఏకమొత్తం మాట్లాడకూడదు. మీటరు పైన కొంత ఇస్తామనాలి" అని అంటూ సామాన్లు పట్టుకుని లోపలికి నడిచింది సరోజ. పరమేశం అక్కని అనుసరించాడు.

లోపల పెరట్లోకి వెళ్లేటప్పటికి అక్కడ అంతా కోలాహలంగా ఉంది. నీళ్లు పట్టేవాళ్లు, ముఖాలు కడిగేవాళ్లు అంట్లు తోమేవాళ్లు అంతా పండగ సంబరంగా ఉంది. పరమేశం క్షణం పాటు అక్కడే నిలబడిపోయి అటే చూస్తుండిపోయాడు. 'పండుగ ఏమీ లేదు గదా' అని మనసులో అనుకుంటూ "అందరూ హడావిడిగా ఉన్నారేమిటి అక్కా?" అని అడిగాడు పరమేశం అర్థంగాక.

"మాకు ఇవ్వాళ నీళ్లొస్తాయిరా తమ్ముడూ! రోజు విడిచి రోజు కదా నీళ్లొచ్చేది" అంది సరోజ.

"ఊహు దానికా!" అని కొంచెం ఆశ్చర్యం ప్రకటించి ముందుకు కదిలాడు పరమేశం. పరమేశాన్ని అల్లంత దూరాన్నుంచి చూసిన మేనల్లుడు, మేనకోడలు అతని వద్దకు పరుగెత్తుకొచ్చారు. అందరూ గదిలోకి నడిచారు. సరోజ భర్త సంగీతరావు మంచంపై నిద్ర పోతున్నాడు. ఇల్లంతా చిందర వందరగా ఉంది. అక్కడక్కడా నీళ్లు చిలికిపోయి నేల తడితడిగా ఉంది. పరమేశం సోఫాలో కూలబడ్డాడు.

"బావగారు ఇంకా లేవలేదు. ఈ రోజు ఆఫీసు లేదా, అక్కా?" అడిగాడు పరమేశం.

" తెల్లవారు జామున నీళ్లు పట్టి మళ్లీ పడుకున్నార్రా' ' అంది సరోజ పని చేసుకుంటూ.

పిల్లలు కుళాయి దగ్గర్నుంచి చిన్న పాత్రలలో నీళ్లు మోయసాగారు.

"ఊర్లో అందరూ బాగున్నారా?"

"అమ్మా, నాన్నా ఆరోగ్యం బాగానే ఉంది గాని అమ్మకు నడుం నొప్పి పూర్తిగా తగ్గలేదు" అన్నాడు పరమేశం.

"ఊహు అలాగా" అని, "సర్లే తర్వాత మాట్లాడుకుందాం. ముందు నువ్వెళ్లి ముఖం కడుక్కుని స్నానం చేయి. మళ్లీ నల్లా (కుళాయి) బందవుతుంది అంది సరోజ. ఆ మాటలతో పరమేశానికి చిరాకొచ్చింది. కాళ్లు బార్లా చాపి బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు.

"ఏమిటో ఇంత పొద్దున్నే స్నానమా?" అన్నాడు ఆవులిస్తూ.

"లేకుంటే కాస్సేపయితే నీళ్లుండవు మావయ్యా! త్వరగా వెళ్లు" అన్నాడు మేనల్లుడు రవి వత్తిడి చేస్తూ లోలోపల గొణుక్కుంటూ బ్రష్ పట్టుకుని వెళ్లాడు పరమేశం. రవి బక్కెట్టుతో నీళ్లు తెచ్చి పెట్టాడు. పరమేశం దంతధావనం కానిచ్చి స్నానానికుపక్రమించాడు. క్షణంపాటు పరమేశం గుడ్లు మిటకరించి బకెట్టుకేసి చూశాడు.

'ఒక్క బక్కెట్టు! స్నానానికి ఒక్క బక్కెట్టు నీళ్లు. ఏం సరిపోతాయి?" గొణుక్కున్నాడు పరమేశం. చటుక్కున బయటకొచ్చి, అక్కడే ఉన్న మరో నిండు బకెట్టుని తీసుకెళ్లి లోపల పెట్టుకున్నాడు.

"ఇంత పొద్దున్నే స్నానమేమిటిరా దేవుడా!" అనుకుని తిట్టుకుంటూ, తుమ్ముకుంటూ స్నానం పూర్తి చేసి, గదిలోకి వచ్చి పడ్డాడు.

"మీకు నీళ్లు చాలా కష్టంగా ఉంది కదక్కా?" అన్నాడు ఉండబట్టలేక. నీటి గురించి వ్యాఖ్యానిస్తూ.

"అవున్రా తమ్ముడూ! మాకు దేనికీ ఇబ్బంది ఉండదు, ఒక్క నీళ్ల సమస్య తప్ప" అంది సాగదీస్తూ.

పిల్లలు అప్పటికే ముఖాలు కడిగేసుకుని స్నానాలు చేయటం ఆరంభించారు. సంగీతరావు లేచి గడ్డం గీసుకుంటున్నాడు.

"ఈ నీళ్ల డ్యూటీ బావగారికి కూడా తప్ప లేదన్న మాట" అన్నాడు పరమేశం బావకేసి చూస్తూ జాలిగా. నీళ్ల వ్యవహారంలో సంగీతరావు వేగాన్ని చూస్తే పరమేశానికి ఆశ్చర్యమేసింది. 'ఈ నగరంలో ఇంతేనేమో' అనుకున్నాడు మనసులో అక్క టిఫిన్లూ, టీలు ఇస్తే అన్నీ కానిచ్చేసి మంచం మీద వాలిపోయాడు.

బడలిక వలన పరమేశం మధ్యాహ్నం దాక నిద్ర లేవనేలేదు. రెండు గంటలు కావస్తుంటే సరోజ లేపింద అతన్ని. చన్నీళ్లతో ముఖం కడుక్కొని వచ్చాడు పరమేశం. భోజనం వడ్డించి పక్కనే కూర్చుంది సరోజ.

"ఏదయినా చేస్తున్నావా, ఖాళీగా ఉన్నావురా అక్కడ? నాన్నగారు దుబారా మనిషని తిట్టేవారు నిన్ను. అలాగే ఉన్నావా, ఏవయినా మారావా?" అంది తమ్ముణ్ణి ఉద్దేశించి.

ఆ మాటలకి పరమేశం కొంటెగా నవ్వాడు.

"నేనా?" అన్నాడు వెటకారంగా, తనని కానట్టు.

"ఆ నువ్వే" అంది సరోజ.

కాసేపు ఎటో చూసి "మంచి నీళ్లివ్వు" అన్నాడు పరమేశం.


సరోజ వంట గదిలోకి వెళ్లి గ్లాసుతో నీళ్లు తెచ్చి ఇచ్చింది. పరమేశం గ్లాసు వంక తదేకంగా చూసి "తాగటానికి కూడా కరువేనా?" అన్నాడు.


సరోజ చురుగ్గా చూసింది.

"కాకపోతే? ఇవి తాగే నీళ్లు ఫిల్టరులోవి" అంది చిరుకోపంగా. అని మళ్లీ "కొన్ని ఏరియాల్లో తాగటాని క్కూడా నీళ్లు దొరకవు తెల్సా?" అంది.

"ఓహో! అలాగా. అక్కడయితే నీళ్లు చెంబుల్తో సగం తాగి సగం పారబోస్తాం" అన్నాడు పరమేశం గర్వంగా.

సరోజ తమ్ముడి మాటలు విని నిట్టూర్చింది. ఏమీ






తోచలేదు అనేది. "పోనీలే. నువ్వక్కడ ఎన్ని రోజులుంటావ్?" అని అడిగి, మళ్లీ తనే "రెండు మూడు నెలలుండు" ఆజ్ఞాపిస్తున్నట్టు.

పరమేశం సరే అన్నట్టు తలాడించాడు.

నాలుగు రోజులు గడిచాయి. ఆ రోజు ఆదివారం. ఆదివారం అంటే అందరికీ ఆటవిడుపు రోజు. సరోజ వంద రూపాయలు పరమేశానికి ఇచ్చి రవిని వెంటబెట్టుకు వెళ్లి బజారు నుంచి కూరలూ అవీ తెమ్మంది. ఒక బుట్ట పట్టుకుని పరమేశం, రవి బజారుకు బయల్దేరారు. దారిలో అటూ ఇటూ ఉన్న షాపుల్ని చూసుకుంటూ మాట్లాడు కుంటూ ముందుగా మాంసం దుకాణం వద్దకు నడిచారు.

"ఒక కిలో మాంసం కొట్టు" అన్నాడు పరమేశం ఆజ్ఞను జారీ చేస్తూ ఆ మాట విని రవి అందుకున్నాడు "మామయ్యోయ్! కిలో అరవై రూపాయలు. ఇంకా సరకులు తీసుకోవాలి. అన్నింటికీ ఈ డబ్బులే అడ్జెస్ట్ చేయాలి" అన్నాడు.

"హార్నీ! కేజీ అరవయ్యా? మా ఊళ్లో అయితే యాభయ్యే" అన్నాడు పరమేశం గొప్పగా.

"ఏ ఊరి బడాయి వదిలెయ్యి. ఇది సిటీ" అన్నాడు రవి. ఖంగుతిన్నాడు పరమేశం. నోరు మెదపలేకపోయాడు కొంతసేపు. మాంసం అర కిలో తీసుకుని అక్కణ్నుంచి బయటపడ్డారు. రవి ఒక జనరల్ షాపు వైపు దారి చూపాడు.

"ఏంటో. ఇక్కడ కిరాణా దుకాణాలు పెద్ద పెద్ద షాపుల్లా ఉన్నాయి" అనుకున్నాడు పరమేశం మనసులో.

"ఇక్కడ ఏం భాష మాట్లాడాలో.. ఇదిగో రెండు కేజీలు మినపప్పు, కేజీ బొంబాయి రవ్వ త్వరగా కట్టివ్వు' ' అన్నాడు.

"మామయ్యోయ్! ఆగాగు. అన్నీ ఎక్కువ చెప్పే స్తున్నావ్. కిలో మినప్పప్పు, అర్ధ కిలో బొంబాయి రవ్వ. మిగతా పైసలు పెట్రోలుకి కూరగాయలకి, మిగిలినవి ఇంట్లో ఖర్చుకి" అన్నాడు రవి దండకం చదివినట్టుగా.

దానితో పరమేశం బుర్ర గోక్కున్నాడు.

"ఊ.. సర్లే. అలాగే కానియ్యి" అన్నాడు రాజీపడుతూ.

గంటలో బజారంతా తిరిగి కొనాల్సినవి కొనేసి ఇంటికి తిరిగి వచ్చారిద్దరూ. ఇంటికి రాగానే అన్నాడు పరమేశం. "అక్కోయ్! బజార్లో భలే రేట్లున్నాయ్."

"మరేమనుకున్నావ్‌రా తమ్ముడూ. ఇలాగే బతుకు తున్నాం మరి" అంది సరోజ గాల్లో చేతులూపుతూ.

"అయితే బతికినట్టే" అన్నాడు పరమేశం నిట్టూరుస్తూ.

"మరేమనుకున్నావ్ మామయ్యా! సినిమా కెళ్లాలన్నా డబ్బులు ఎంతయిపోతాయో!" రవి అందుకున్నాడు.

"అబ్బో! నువ్వు కూడా పెద్ద ఆరిందా అయిపోయావే, కూస్తంత లేవు" పరమేశం బోల్డంత ఆశ్చపోయాడు.

ఆ మాటల్తో అందరూ నవ్వుల్లో మునిగిపోయారు.

రోజులు గడుస్తున్నాయి.

వచ్చిన కొద్ది రోజుల్లోనే పరమేశానికి కొంత మంది స్నేహితులయ్యారు. ఉద్యోగం సద్యోగం ఏమీ లేకపోయినా ఇంట్లో చిన్న చిన్న పనులుంటే తర్వాత బయట తిరగటం -నాలుగు విషయాలు తెలుసుకోవటం వంటివి పరమేశానికి అలవాటయ్యాయి. సరోజ కూడా అతనికి జేబు డబ్బులు (పాకెట్ మనీ) కొంత ఇవ్వసాగింది. నెల రోజులు గడిచాయి. వేసవి వచ్చింది. ఎండలు విపరీతంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా వేడిగాడ్పులు. జలాశయాల్లో నీళ్లు తరిగిపోయాయి. నీటి ఎద్దడి ఎక్కువైంది. నగరంలోని వివిధ వాడల్లో - కాలనీల్లో మంచినీరు సరఫరా తగ్గిపోయింది. చాలా ప్రాంతాల్లో టాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు. అన్ని కాలనీల్లాగే ఆ కాలనీకి కూడా నీటి ఎద్దడి ఎక్కువైంది. ఉన్నట్టుండి రెండు రోజులు నీరు పూర్తిగా బంద్ అయిపోయింది.

ఒక రోజు మధ్యాహ్నం నీళ్ల టాంకర్ వచ్చింది. ఆడా, మగా భేదం లేకుండా బిందెలు, బకెట్లతో వరసగా నిలబడ్డారు. కొంతసేపు సాఫీగా నీళ్లు పట్టుకున్నారు. ఆ తర్వాత తొక్కిసలాట మొదలైంది. ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు ఎగబడ్డారు. సగం నీళ్లు బిందెల్లో పడుతుంటే సగం నీళ్లు నేల పాలవసాగాయి. కొంత సేపటికి టాంకర్ ఖాళీ అయిపోయింది. టాంకర్ వెళ్లిపోయింది. పరమేశం బిందె, బకెట్టు పట్టుకెళ్లాడుగాని ఒక దానిలోనూ నీళ్లు దొరకలేదు.

"ఇంట్లో బిందెడు నీళ్లులేవు. పక్క కాలనీలో బోరింగు ఉంది. వెళ్లి రెండు బిందెలు కొట్టుకురా పరమేశం!" అంది సరోజ.

బోరింగు అనేటప్పటికి పరమేశానికి గుండె జారిపోయింది. బిక్క మొహంవేసి చూడసాగాడు.

"మీన మేషాలు లెక్కపెడితే కాదు. త్వరగా వెళ్లు. మళ్లీ అక్కడ జనం ఎక్కువయ్యారంటే అవీ దొరకవు" అంది గద్దిస్తున్నట్టుగా. ఉసూరుమంటూ బకెట్టూ, బిందె పట్టుకుని రవిని వెంట బెట్టుకుని పట్టు వదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగి వెళ్లినట్టు బోరింగు వద్దకు నడిచాడు.

అప్పటికే అక్కడ జనం పోగయి ఉన్నారు. బిందెలు మీద బిందెలు - బకెట్టు వెనక బకెట్టు వరసగా ఉన్నాయి. నేను ముందంటే నేను ముందంటూ అరుస్తున్నారు. ఆ దృశ్యం చూసేటప్పటికి 'ఇక్కడ నీళ్లు దొరుకుతాయా' అన్న అనుమానం, కుసింత భయం కూడా కలిగాయి పరమేశానికి. 'ధైర్యే సాహసే లక్ష్మీ' అనుకుంటూ రంగంలోకి దూకాడు. బిందె, బకెట్టు పెట్టి నిలబడ్డాడు. గంటన్నర నిలువుకాళ్లమీద నిలబడి - అవురావురుమంటూ చూశాడు తన వంతుకోసం. ఎలాగో తన వంతు వచ్చింది. బిందె పెట్టి పావుగంట దబదబమని కొడితే అప్పుడు నిండింది బిందె. బకెట్టు నింపటానికి మరో పది నిముషాలు పట్టింది. దాంతో పారమేశానికి రెక్కలు పడిపోయినట్లయి పోయింది. కాళ్లు, చేతులూ చెమటలు కారిపోసాగాయి. ఒళ్లు హూనం అయిపోయింది. బకెట్టు, బిందె పక్కనపెట్టి - ఓసారి చుట్టూ తేరిపార చూసి "హుఁ వెధవ నీళ్ల కోసం తన్నుకు చస్తున్నారు మీరు. మా ఊళ్లో మా ఇంటి పక్కనుంచి కాలువ పారుతుంది. అక్కడ బోల్డన్ని నీళ్లు. వర్షాకాలమయితే మా ఇంట్లోనే కావల్సినంత నీరు. మా ఊరొచ్చి తెచ్చుకోండి నీళ్లు కావలసి వస్తే" అన్నాడు అశరీరవాణి పలికినట్లు, ఆ జనాన్ని ఉద్దేశించి పరమేశం.

జనం ఎక్కువయ్యేటప్పటికి బకెట్టు, బిందె పట్టుకుని రోడ్డు మీది కొచ్చాడు. దూరాన్నుంచి సరోజ చూస్తోంది. పరమేశం కొంతదూరం వచ్చేప్పటికి ఆమె చేయి చాపి బిందె అందుకుంది. ఇద్దరూ ఎలాగైతేనేం వాటిని ఇంటికి చేర్చారు. పరమేశం అయాసపడుతూ బకెట్టు కింద పెట్టాడు.

"అక్కోయ్! నిన్నట్నుంచి నాకు స్నానం లేదు. ఈ బకెట్టు నేను స్నానం చేస్తాను' అన్నాడు పరమేశం. తమ్ముడి పరిస్థితికి సరోజకి జాలి కలిగింది. బకెట్టు తీసుకెళ్లి బాత్రూంలో పెట్టింది. తువ్వాలు, మగ్గు పట్టుకుని బాత్రూంలోకి దూరాడు పరమేశం. మగ్గు బకెట్టులో ముంచి తీశాడు. దాని వంక జాలిగా చూశాడు. 'హుఁ పెద్ద చెంబుతో నీళ్లు పోసుకునేవాడిని. మగ్గుతో పోసుకోవలసి వస్తోంది. ఒక్క బకెట్టు నీళ్లతో ఎప్పుడూ స్నానం చేయలేదు. రెండేసి బకెట్లు చేసేవాణ్ణి. ఊళ్లో అయితే ఇలా ఉండేదా?' మనసులో గొణుక్కున్నాడు, తిట్టుకున్నాడు ఆ రోజు అలా గడిచిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. పరమేశం అదే గొణగుడు - అనే తిట్లు. అలా రెండు నెలలు గడిచాయి. పరమేశం తన్ను తాను తిట్టుకోవటం, గొణుక్కోవటం వందల సార్లయిపోయింది. ఆపైన ఇంక గొణుక్కోవటం, తిట్టుకోవటం మానేశాడు. ఆ మాటలే పూర్తిగా

# మెట్టిన వేళ

## ఆత్మాభిమానం



పెళ్లయిన ప్రతి యువతికి మెట్టినింటికి వెళుతూంటే బెదురు, బెదురుగానే ఉంటుంది. అలాంటప్పుడు జరిగిన ఒక సంఘటన గుర్తుకు వచ్చి ఇప్పటికీ నవ్వుకుంటాను.

పెళ్లయి పోయిం తర్వాత అత్తవారింటికి కారుతో వస్తున్నాము. ఏప్రిల్ నెల కావటం వల్ల ఎండ తీక్షణంగా ఉంది. మధ్యదారిలోని ఊళ్లో కారు ఆపి అందరికీ కూల్ డ్రింక్స్ ఇప్పించారు. వారందరూ గోల్డ్‌స్పాట్‌లు, నాకు డ్రైవరుకు మాత్రం కోకోకోలా తీసుకోని ఇచ్చారు. కూల్‌డ్రింక్స్ గూర్చి సరైన అవగాహన లేని నేను వారంతా ఎక్కువ ఖరీదైనవి తాగుతూ నాకు తక్కువ ధరది ఇచ్చిరేమోనన్న అనుమానం వచ్చింది. దాహంగా ఉన్నా సరే తాగనన్నాను. ఎందుకు అని అడిగినా వారితో "కూల్‌డ్రింక్స్ ఇష్టముండవు" అంటూ చెప్పాను.

వాళ్లు విచిత్రంగా నా వైపు చూస్తుంటే మొహం పక్కకు తిప్పుకున్నాను. మనసులో మాత్రం వాళ్లమీద విపరీతమైన కోపం కలిగింది. గోల్డ్‌స్పాట్‌లు స్పాట్‌లో లేనందువల్ల కోకోకోలా తీసుకున్నానని ఆ తరువాత వాటి ధరలు కూడా తెలుసుకున్నాక నేను ఈ సంఘటన వాళ్లకు చెప్పలేదు. మీకు ఆత్మాభిమానం ఎక్కువంటూ ఎప్పుడైనా ఎవరైనా అన్నప్పుడు ఈ అనుభవం జ్ఞప్తికి వస్తుంది.

వి. కృష్ణకుమారి
(హైదరాబాద్)

మర్చిపోయాడు.

వేసవి తన ప్రతాపాన్ని చూపెస్తూనే ఉంది. నీటి ఎద్దడి ఎక్కువవటం వలన రోజూ బోరింగ్ నీళ్లే శరణ్యమయ్యాయి అందరికీ. ఇటీవల పరమేశం నీళ్ల విషయంలో ఒక పద్ధతికి అలవాటుపడ్డాడు. ఇప్పుడు ఇంట్లోకి మంచినీళ్లు తెచ్చేశాక, తన స్నానానికి ఒక బకెట్టు నీళ్లు తెచ్చుకుని బాత్రూంలో ఓ మూల పెట్టుకుంటాడు. ఆ నీళ్లు మరి ఎవరూ వాడకుండా భద్రంగా చూసుకుంటాడు. అంతకు ముందు వాడే మగ్గు కాక దానికన్నా కొంచెం చిన్న మగ్గుతో స్నానం చేస్తున్నాడు. ఇదివరకు రెండు పూటలా స్నానం చేసేవాడు. ఇప్పుడు ఒక పూటతోనే సరిపెట్టు కుంటున్నాడు. భోజనాల దగ్గర చెంబులో మంచి నీళ్లు పెట్టుకునేవాడు, ఇప్పుడు గ్లాసుతో కంచం వద్ద పెట్టుకుని వాటినే తాగుతున్నాడు. అవి అయిపోతే మళ్లీ తెచ్చుకుంటున్నాడు.

ఇప్పుడు పరమేశం నీళ్ల వద్దే కాదు, డబ్బు దగ్గర కూడా జాగ్రత్తకు వచ్చేశాడు. ఏ చిన్న వస్తువు కొనాలన్నా ఆచి తూచి బేరమాడి మరీ కొంటున్నాడు. రూపాయిలో పైసలు లెక్కపెట్టడం నేర్చుకున్నాడు. దానికి అతని అలవాట్లలో, చేతల్లో మార్పు రావటం ఒకటయితే అక్క సరోజ ప్రవర్తన కూడా కొంత కారణమైంది. 'అవసరం మేరకే' డబ్బులు ఇవ్వటం - తర్వాత దానిపై నిఘా ఉంచటం మొదలైంది. అన్నింటికంటే చుట్టూ ఉన్న పరిస్థితులనుబట్టి అతని అవగాహనలో మార్పు రావటం. మార్పుకు మచ్చుతునక -

ఓ రోజు మిట్ట మధ్యాహ్నం. ఇంట్లో ఎవరూ లేరు. అరుపులు విని వీధిలోకి వెళ్లాడు పరమేశం. అక్కడ చట్టి పట్టుకుని ముష్టివాడు. 'దాహం బాబూ. కాసిన్ని నీళ్లు పొయ్యండి' అన్నాడు. పరమేశం వెంటనే లోపలికెళ్లి గ్లాసుతో నీళ్లు తెచ్చాడు "ఇంతే ఉన్నాయి. తాగు" అని వాటిని చట్టిలో పోశాడు. ముష్టివాడు గటగట తాగేసి 'దండాలు బాబూ' అంటూ వెళ్లిపోయాడు. ఇంతలోనే మరొక ముష్టివాడు వచ్చాడు "ధర్మం బాబూ?" అంటూ. పరమేశం విసుక్కొంటూ జేబులో చెయ్యి పెట్టాడు. రూపాయి తీశాడు బయటికి. అంతలో ఏదో గుర్తొచ్చినట్టు తీక్షణంగా దాని వంక చూసి, చటుక్కున జేబులో పెట్టేసి, పది పైసలు తీశాడు. "ఊఁపట్టు" అని ఆ నాణాన్ని ముష్టి వాడి చేతిలో పెట్టి లోనికెళ్లిపోయాడు.

అప్పుడే పరమేశం హైదరాబాదు వచ్చి ఆరు నెలలు అయిపోయింది. ఉన్నట్టుండి ఒక రోజు ఊరు నుంచి తాతారావు దిగాడు, అందర్నీ చూడటం కోసం. అందరికీ ఒకటే సంతోషం అతని రాకతో.

ఆ రోజు సాయంకాలం. అందరూ భోజనాలు చేస్తున్నారు. పరమేశం గ్లాసుతో నీళ్లు గటగట తాగు తున్నాడు. సంగీతరావు పరమేశాన్ని ఆటపట్టించాలని చూశాడు.

"మీ పరమేశం నీళ్లదగ్గర పొదుపరయిపోయాడండీ!' అన్నాడు నవ్వుతూ.

దాంతో సరోజ అందుకుంది- "ఎందుక్కాదూ? నీళ్లేమిటి? డబ్బు వద్ద కూడా పొదుపరి అయిపోయాడు మా తమ్ముడు. అప్పట్లా కాదు. ఇప్పుడు దేనికయినా డబ్బులు ఇస్తే జాగ్రత్తగా ఖర్చుపెట్టి మిగిలినవి పదిలంగా తెచ్చి నాకిస్తున్నాడు."

"ఓహో! అలాగా... ఇదివరకు మంచినీళ్ల ప్రాయంగా డబ్బు ఖర్చుపెట్టేవాడు. ఇప్పుడు రెండింటినీ పొదుపుగా వాడటం ఆరంభించాడన్నమాట నీ తమ్ముడు. బావుం దోయ్ బామ్మర్దీ" అన్నాడు నవ్వుతూ పరమేశం వంక చూసి.

కొడుకు జాగ్రత్త మనిషయి పోయాడని విని తాతారావు ఆనందపడిపోయాడు.

"అంత మారిపోయావ్రా?" అన్నాడు పరమేశం వైపు చూసి.

"ఎందు క్కాలేదు నాన్నా? నేను అప్పుడప్పుడు పాకెట్ మనీగా ఇచ్చే డబ్బులు దాచుకుని ఈ మధ్య ఇక రిస్ట్ వాచి కూడా కొనుక్కున్నాడు" అంది సరోజ తండ్రితో. తాతారావు పితృవాత్సల్యంతో తనయుడి ముఖం వంక చూశాడు, తృప్తిగా "అలాగా! అరు నెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారట. అలా మారిపోయాడన్నమాట!' ' అన్నాడు నవ్వుతూ.

ఆ మాటలకు అందరికీ నవ్వొచ్చింది.

భోజనాలు ముగిశాయి.

భుక్తాయాసంతో ఆపసోపాలు పడుతున్నాడు తాతారావు కుర్చీలో. పరమేశానికి రెండు రూపాయ లిచ్చి వక్కపొడి, చుట్ట తెమ్మన్నాడు. పరమేశం డబ్బులు తీసుకుని వెళ్లి పది నిమిషాల్లో తిరిగొచ్చాడు. ఒక వక్కపొడి పొట్లం, ఒక చుట్ట తండ్రి చేతిలో పెట్టాడు.

"రెండ్రుపాయల్లో పావలా మిగిలింది" అన్నాడు పరమేశం పావలా చూపించి "నేను తీసుకుంటున్నాను నాన్నా!"

దాంతో అందరూ గొల్లున నవ్వారు.

### ఫ్రీయే

"హాయ్ బేబీ! ఈ రోజు కొత్తగా కాన్వెంట్‌లో చేరావా. నీ పేరేం పేరు? డబ్బు కట్టేశావా?"

"డబ్బెందుకు టీచర్? నాకింకా అయిదేళ్ల నిండలేదు. బస్సుల్లోనూ రైళ్లలోనూ, సినిమా హాళ్లలోనూ ఎక్కడా డబ్బు పుచ్చుకోరు."

"ఆఁ....!"

వి.వి.సీతారాం దాస్(గుంటూరు)